


# అజ్ఞానం

శ్రీ భాగవతుల నారాయణమూర్తి

"నాన్నా, పెండ్లికొడుకును వెతికాను. కుఱ్ఱవానికి యిరవై సంవత్సరాలుంటాయి. ఎంట్రన్సు పరీక్షకు వెళతాడు యీయేడు. వాని తండ్రికి పోస్టాఫీసులోపని. జీతం రూ. 50/-లు. యిల్లు వాకిలివుంది. కాని కట్నం చాలా జాస్తిగా అడుగుచున్నారు. పన్నెండు వందల రూపాయలకు ఒకదమ్మిడీ తక్కువయితే వప్పుకోనన్నారు. ఎలాగైతేనేం యెనిమిది వందలకు కుదిర్చాను. అన్నిటికన్న గొప్ప విశేషమేమిటంటే కుఱ్ఱవానిది సాంప్రదాయమైన కుటుంబం. అదీగాక వాళ్ళు, వూరుకూడ చాలాదగ్గర. ఇంత దగ్గరలో యిటువంటి సంబంధం దొరకడం అదృష్టమే" అని యింట్లో కాలుపెట్టీపెట్టడంతోనే గుక్క విడవకుండా చెప్పాడు యీశ్వరదత్తు వాళ్ళ, నాన్నతో.

"కాని వానికంటె వేయిరెట్లు వుత్తముడయిన వరుణ్ణి నేను కుదిర్చాను. కుఱ్ఱవాడు బి. యే పరీక్షకు వెళ్తున్నాడు. ఘనుగా ప్యాసవుతాడన్న ఆశకూడావుంది. అదిగాక వాడు గొప్ప వ్యాసకర్తకూడాను" అన్నాడు తండ్రి నవ్వుతూ.

ఆ మాటలకు ఆశ్చర్యపోయాడు ఈశ్వరదత్తు. "బాగుంది, యింత త్రుటికాలంలో అలాంటి పెళ్ళికొడుకును మీరెలా వెతికారు? వానిదేవూరు?" అని ప్రశ్నించాడు తండ్రిని.

"వరుడు దూరంగాలేడు, మన వూళ్ళోనే"

విస్మితుడై పోయాడు ఈశ్వరదత్తు. "మీరు చెప్పింది నాకేమి బోధపడడంలేదు. ఆవరుడెవడో స్పష్టంగా చెప్పకూడదూ" అన్నాడు దత్తు గాభరాపడుతూ.

"చెప్పాను కానూ మరీ కుఱ్ఱవాడు యీవూరువాడని, నీకు పరమ మిత్రుడని."

రోషంవచ్చింది దత్తుకు. "తెలిసింది తెలిసింది, సత్యనాథంవలలో మీరుకూడా పడ్డారూ, వాడు బలే చలాకి, కపటి అనడానికి యిక సందేహించ నక్కరలేదు. సరే మీకోరిక అలాగున్నప్పుడు కానియ్యండి. యీరీతిగా యిష్టానుసారం ధర్మ విరుద్ధమయిన కార్యాలు చేసే యింట్లో నేనో నిమిషమయినా వుండదలచుకోలేదు. రామ రామ, యెంతపని చేయ సాహసించారు" అన్నాడుదత్తు.

"నీ దగ్గరవున్న చెడ్డగుణం యిదే ప్రతీదానికీ యిట్టే రోషం తెచ్చుకుంటావు. అంచేత మంచీచెడ్డా ఆలోచించలేవు. యీ సంబంధం విషయంలో యెట్టిదోషంకాని పాపంకాని నీవు నిరూపిస్తావనినే ననుకోలేదు. కమల యిష్టకు విరుద్ధంగా పైవానికెవడికైనా యిచ్చి వివాహంచేస్తే అది పాపం, ధర్మ విరుద్ధమున్నూ. కమల సత్యనాథంను నిష్కపట హృదయంతో ప్రేమించి వానినే తన పతియైతే బాగా వుంటుందనుకుంటున్నప్పుడు వారి పరస్పరానురాగమును గంగపాలు చేయడం పాపం కాదూ?" అన్నాడు తండ్రి హరిశంకరుడు.

"కమలా సత్యనాథాలు ఒకరితో ఒకరు చనువుగా కలిసిమెలసి వుండేటట్లు చెయ్యడంలో మనదే తప్పు. అందుకనే యుక్తవయస్కురాలయిన పిల్లను అన్య పురుషులతో

తరువాయి 17 వ పేజీలో

యేకాంతంగా విడిచి పెట్ట రాదని శాస్త్రాల్లో వ్రాశారు. కమల ఉత్తి అమాయకురాలు. యింకా మంచీ చెడ్డా గ్రహించే పాటిజ్ఞానం కూడా లేదు. అలాంటి స్థితిలో మోహ పరవశురాలై అజ్ఞానంచేత ఏదైనా పని చేసిందంటే యెంత ప్రమాదం వస్తుంది. ఛీ, బ్రాహ్మణ జాతిలో జన్మించిన పిల్లను కులహీనునకిచ్చి వివాహమా! యెంతటి ఘోరం, యెంతటి నింద్యకార్యం! నాన్నగారూ సమాజమునకు సనాతన ధర్మమునకు మీరు పరమ శత్రువులయి పోతారు. చేయి కాలినతర్వాత ఆకులు పట్టిన లాభం లేదు.” అన్నాడు ఈశ్వర దత్తు వుద్రేకంతో.

ఆ సమయంలో యేమి చెప్పిన కొడుకు తల కెక్కదనుకొన్నాడు తండ్రి. తర్కం వల్ల వానిని సంతుష్టి పర్చడం కష్టమనుకొన్నాడు. యీ ప్రస్తాపన యింతటితో చాలిస్తేనే బాగుంటుందనుకొని “సరే, మరి వెళ్లు, రెండు ఝాములైన తర్వాత యీ విషయం మాట్లాడుకోవచ్చున”న్నాడు తండ్రి. ఈశ్వర దత్తు వెళ్లిపోయాడక్కడ నుంచి. హరి శంకరుడు ఆలోచనా సముద్రంలో మునిగిపోయాడు.

౨

పిలవగానే యింటిలోని పలికి వచ్చాడు ఈశ్వరదత్తు. తల్లిదండ్రి చింతాక్రాంతులై గాభరాపడుతూ వుండడం చూశాడు. తండ్రి ముఖంపైని కొంత గంభీరం విరాజిల్లుతూంది. యీశ్వరదత్తు రావడంతోనే తల్లి బుర్ర పైకెత్తి తదేక దృష్టితో భర్తను, కుమారుని చూడసాగింది. పుత్రుని కూర్చోబెట్టి తల్లి వాని తల నిమిరింది వాత్సల్యంతో సంగతేమిటో గ్రహించలేక పోయాడు దత్తు. ఆశ్చర్యం, ఉద్రేకం, సందేహం అధికమయి పోయాయి. తల్లి వైపుకు చూశాడు. ఏదో మాట్లాడుదామనుకొన్నాడు కాని ధైర్యం చాలింది కాదు. కొంతసేపటివరకు యెవరూ మాట్లాడ్డంలేదు. ఆఖరికి హరిశంకరుడు “నాయనా, నీతో ఓ గొప్ప రహస్యాన్ని చెప్పవలసి వుంది. ఆ రహస్యం నీతో యెప్పుడైనా చెప్పడానికి అవసరం కలగదని అనుకొన్నాము. కాని యిప్పుడా రహస్యం చెప్పకపోతే కాగల కార్యం కానట్లుంది” అన్నాడు.

ఆమాటపైని తల్లి అంది “చిట్టితండ్రీ, ఆ గుప్త రహస్యం వినకముందు నువ్వు వాగ్దత్తం చెయ్యాలి అదేమిటంటే యెంతటి కారణము కల్గినాసరే దుఃఖితురాలైన మీతల్లితో యెడబాటుకొనని.”

తల్లి స్థితిచూచి, ఆమె నోటివెంట వచ్చే మాటలు వినడంతోనే పరిపరి సందేహాలతో శరీరం కంపింపసాగింది ఈశ్వరదత్తుకు. కాని తల్లిని సంతుష్ట పర్చడానికనివెంటనే “అమ్మా; ఏమిటలాగంటావు. ఏ పరిస్థితి వలనైనా మారిపోయి నిన్నువిడిచి పెట్టేస్తానని అనుమానిస్తున్నావా? అటుల యెన్నటికి జరగదు. ఏమటా అవనీ, యే స్థితిలో నట్లాపడనీ యెప్పుడుకూడా నేను నీకు పుత్రుడను, నీవు మా అమ్మవి. ఇది నిశ్చయం. ప్రపంచంలో యే మహాశక్తికూడ నన్ను నీతో దూరంగా చేయలేదు” అన్నాడు గంభీరంగా.

కుమారుని మాటలు వినిడంతోనే తల్లి ముఖపద్మం వికసించింది. ఆనందజ్యోతి దుఃఖ తిమిరమును దూరంగా పారద్రోలింది. కుమారుని తల ముద్దులాడింది తల్లి ప్రేమ పూడి పడునట్లుగా తండ్రి ధైర్యంతో “యీశ్వర్, నీవు పెంపుడు పుత్రుడవు కావు సుమా” అన్నాడు.

తలాతోక ఆడిందికాదు దత్తుకు. అగాధ సముద్రంలో తన్ను విసరివేసినట్లయింది. ఆశ్చర్యం దుఃఖం ఒక్కమారుగా అతనిలో తాండవించేయి. కళ్లు బాగావిప్పి తల్లిదండ్రులవేపు చూస్తున్నాడు వారిమాటలపై యింకా అనుమానం వున్నట్లుగా. చీత్కారం చేస్తూలేచి “ఏమి, నేను నిజంగా మీ పుత్రుణ్ణికానూ? అయితే నాతల్లిదండ్రి యెవరు?” అని అడిగాడు దత్తు.

కుమారుని చేరదీసి “నాయనా, నీ తల్లిదండ్రి యెవరైతేనేం, నిన్ను కడుపున పుట్టిన కొడుకుకంటె యెక్కువగా ప్రేమిస్తూవున్న సంగతి నిశ్చయమే కదా. నాయొక్క జీవనాధారము నీవే. నీవు నాకు ప్రాణముకన్నతీపి” అందితల్లి.

“నాయనా, నేను మొదట రెల్వేమాస్టరుగా పనిచేసిన సంగతి నీకు తెలుసును, నలభై యేళ్ళ వయస్సువచ్చినప్పటికి నాకు సంతానం కలిగిందికాదు. ఒక్క సంతానం కొరకు యెంతో తపిస్తూవుండేవాళ్ళము. నీ తల్లి యెంతోడబ్బు ఖర్చుపెట్టింది. యెన్నో ప్రయత్నాలు చేసింది. కాని కోరిక నెరవేరిందికాదు. హనుమాన్ అనే శూద్రుడు మా స్టేషనులో పిట్ మాన్ (Pit-man) గా పనిచేస్తూ వుండేవాడు. చాలా నెమ్మదయినవాడు. నమ్మకమయినవాడు, వినయంగలవాడు. అందరూ వాడిని చూచి మెచ్చుకొనేవారు. విధవ ముసల్మాను యువతిని యెలాగో పెళ్లిచేసుకొన్నాడు. ఆమె స్వభావం కూడ చాలమంచిది. వాళ్లిద్దరు కులాసాగా కాలక్షేపం చేసుగుంటూ వుండేవారు.

ఒకమారు హనుమాన్‌కు అకాత్తుగా జ్వరం వచ్చింది. అది చిన్న స్టేషను అవడంచేత దగ్గరవున్న గ్రామాల్లో డాక్టరు గాని. మరే వైద్యులు గాని దొరికేరు గారు. చాలా ప్రయత్నంచేయగా ఆఖరికి ఓ వైద్యుడు దొరికాడు. కాని వాని మందుల వల్ల జ్వరం కుదిరిందికాదు. పాపం హనుమాన్ మూడునాలుగురోజులలో చనిపోయాడు. హనుమాన్ జ్వరంతో బాధపడుతూన్న సమయంలోనే వానిభార్య నొప్పులు పడుతూంది. హనుమాన్ యిక గంటకు చనిపోతాడనగా పురుడుకూడవచ్చింది. మగ శిశువు పుట్టాడు. పురటాలుకూడ ఆరోజునే చని

పోయింది. పాపం యిద్దరిని ఒకచితిమీదే దహనం చేయడమయింది.

ఆపుట్టిన శిశువు విషయమై మా కందరకు విచారం కలిగింది. అప్పుడే నాకు కాశీ ట్రాన్స్‌ఫరు అయినట్లు ఆర్డర్లువచ్చాయి. ఆ శిశువును కాశీ తీసుకొనిపోయి శిశురక్షణాలయంలో వుంచుతానని నా స్నేహితులతో చెప్పాను. కాని ఆ శిశువును చూడగానే మీ అమ్మ హృదయంలో ప్రేమ ఉద్భవించింది. పిల్లడిని తన వొళ్ళోనుంచి మరొకరికి వప్పచెప్పడానికి వప్పుకుంది కాదు. "పుత్రవాడిని భగవంతుడు దయతో ప్రసాదించాడు. మనంచేసిన తపస్సు, పూజకు మెచ్చి దేవుడు యీవిధంగా పుత్రసంతానం ప్రసాదించాడు. కాన నేనీపిల్లడిని విడిచిపెట్టనని" మీఅమ్మ కూర్చుంది. నేను కూడా పిల్లలంటే వాచిపోయాను అంచేత మీ అమ్మ మాట నాకూ నచ్చింది. నాయనా, ఆ శిశువువే నువ్వు" అని హరిశంకరుడు చెప్పుచూ కొంచెమాగి మళ్ళా మొదలెట్టాడు "నాయనా, యీశ్వరుని దయవల్ల నీవు మాకు దొరికినందున నీకు యీశ్వరదత్తని పేరుపెట్టాం. యీసంగతి యెప్పుడూ కూడా పైకి రానియ్యకూడదని అనుకొన్నాము. కాని యిప్పుడు విధిలేక చెప్పవలసి వచ్చింది. యీరహస్యం మన ముగ్గురకు తప్ప మరెవరికి తెలియకూడదు సుమా. కుమారా, నీవల్ల మాయిల్లు ప్రకాసించక పోయినను మా హృదయములు జ్యోతిర్మయములయినవి. నాకు యిప్పుడు యెవరిమైని ద్వేషముగాని, అసహ్యముగాని లేదు. కపటభావములేదు. నీవు మా అజ్ఞానం పోగొట్టినావు. జన్మతోనే బ్రాహ్మణత్వం, ఛండాలత్వం కలగదని నేను తెలుసుకొన్నాను."

తన గదిలో కూర్చొని యేదో చదువుకుంటున్నాడు సత్యనాథం. ఆ సమయంలో ఈశ్వరదత్తు గదిలో ప్రవేసించి సత్యనాథుని ఆలింగనం చేసుకొన్నాడు. సత్యనాథుని ఛాతిపై ఈశ్వరదత్తు కన్నీటి బిందువులు నాలుగైదు రాలాయి. సత్యనాథం ఆశ్చర్యపోయి "అరే, ఏమిటి, ఏడుస్తున్నావెందుకు? యివాళ నీ ముఖం యింత వాడిపోయేందేమి?" అని అడిగాడు స్నేహపూర్వకంగా.

"భాయీ, నాకంటికి కప్పియున్న అజ్ఞానం తెర నేడుతీసి వేయబడ్డది. ఇంత వరకు నన్ను మాయ కప్పివేసింది."

సత్యనాథం మరింత ఆశ్చర్యపోయాడు. "ఏమిటి సంగతి, కొంచెం చెప్పకూడదా?" అన్నాడు.

"చెప్తాను కాని, యీ సంగతి వెల్లడి చేయనని ఒట్టు పెట్టుకో,"

"నాపైనీ కింత అపనమ్మకమా, నే నెప్పుడయినా నీయెడల విశ్వాస ఘాతకుడుగా ప్రవర్తించేనా చెప్పు."

తండ్రి చెప్పిన కథంతా యేకరువు పెట్టాడు ఈశ్వరదత్తు. కథంతావిని సత్యనాథం కూడా రాల్చాడు కన్నీటి బిందువుల్ని, దత్తును గాఢాలింగనముచేసి "భాయీ, అయినదేదో అయింది. మరచిపో. జన్మతోనే దేనికీ చిన్న, పెద్ద అనే విచక్షణ వుండదు. నీలో బ్రాహ్మణ సంస్కారం, బ్రాహ్మణ గుణాలు వున్నాయి. అంతా నిన్నాదరిస్తారు." అన్నాడు సత్యనాథం.

స్నేహితుని మాటలు విని మందహాసం చేశాడు దత్తు. "మిత్రమా, మన స్నేహ చిహ్నముగా విలువగల బహుమానం నీకివ్వదలచుకొన్నానోయి. దాన్ని స్వీకరిస్తావనుకొంటాను" అన్నాడు దత్తు.

"ఓహో ఏమిటా కానుక? పేరు చెప్పకూడదా ఏమి?" అన్నాడు సత్యనాథం నవ్వుతూ.

"మా చెల్లెలు కమల."

సత్యనాథం దత్తును మరోమారు కౌగలించుకొన్నాడు స్నేహం కృతజ్ఞత చూపుతూ.

—హిందీనుండి—

